పోలీసు ఆతిథ్యం

వక్కంతం సూర్యనారాయణరావ్

వంకీలు తిరిగిన జుత్తు, వెడల్పాటినుదురు, నల్లకళ్ళద్దాలు, సన్నటి మీసాలు, నీలంరంగు నెక్ టై, ఏమాత్రం నలగని బ్రౌన్ సూటు; శివరామ్ ఠీవిగా అడుగులేస్తున్నాడు. నిగనిగలాడుతున్న బూట్లు పేవ్ మెంట్ మీద ఖరీదుగా చప్పుడు చేస్తున్నాయి. ఫిల్టర్ కింగ్ అతడి పెదవులమధ్య ఇరుక్కుని వేళ్ళాడుతోంది.

ఎడంవైపున వున్న నగల దుకాణాల్ని నిర్లక్ష్యంగా చూస్తూ శివరామ్ నడుస్తున్నాడు. 'గిరిధర్ లాల్ జ్యువలర్స్' ముందు ఆగాడు. నల్లద్దాల వెనకనుంచీ అతనికళ్ళు క్షణకాలం ఆ షాపుని ఎస్టిమేట్ వేశాయి. సగంకాలిన సిగరెట్ ని దూరంగా విసిరి, గ్లాస్ డోర్ ని తోసుకుంటూ శివరామ్ నగల దుకాణంలోకి ప్రవేశించాడు.

పట్టపగలే వెలుగుతున్న ఫ్లోరసెంట్ లైట్లకాంతి రకరకాల నగలమీద పడి మిరుమిట్లు గొలుపుతూ ప్రతిఫలిస్తోంది. ఖరీదైన మెత్తటి తివాసీ నేలని కప్పేసింది.

అరడజనుమంది ఆడవాళ్ళు రకరకాల నగల్ని తమ శరీరాల మీద ట్రై చేస్తూ నిలువుటద్దాలముందు నించున్నారు. బరువైన పర్సుల్ని మోస్తున్నవాళ్ళ భర్తలు డమ్మీల్లా నిలబడ్డారు. రాళ్ల నెక్లెస్‌ని మెళ్ళో వేసుకొంటూ, నెక్లెస్‌ని మరిచిపోయి తన అందాన్ని తృప్తికరంగా చూసుకొంటున్న స్లీవ్‌లెస్ జాకెట్ యువతిని చూసి శివరామ్ తనలో నవ్వుకున్నాడు.

తెల్లటి మేఘాల్లావున్న బూరుగుదూది దిళ్ళకి ఆనుకుని అక్బర్ పాదుషాలా కూచున్న సేట్ గిరిధర్‌లాల్ మీద అతని చూపులు వాలాయి. శివరామ్ అతనివేపు దర్జాగా అడుగులేశాడు.

"దయ్‌చెయ్యండి సాబ్, దయ్‌చెయ్యండి!" సేట్ గిరిధర్‌లాల్ నాలుగు బంగారుపళ్ళు చూపిస్తూ ఆహ్వానించాడు.

శివరామ్ నగిషీలు చెక్కిన స్టూలుమీద కూచున్నాడు. ఏ. సి. షోరూంలో హాయిగావుంది. ఎడంచేతిలోవున్న గోల్డ్ సిగరెట్ కేస్‌నీ, లైటర్‌నీ గ్లాస్‌టాప్ వున్న బల్ల మీద వుంచాడు. నల్లద్దాల్ని తీసి పట్టుకుని, సేట్ వైపు చిరునవ్వుతో చూశాడు.

"ఏంకావాలి సాబ్?" కూతుర్ని చూడ్డానికి వచ్చిన పెళ్ళికొడుకుని అడుగుతున్నంత ప్రేమగా అడిగాడు గిరిధర్‌లాల్.

"ఇవాళ మా వెడ్డింగ్ డే. నా భార్యకి ఖరీదైన ఒకటో నెంబర్ రింగ్ కావాలి," అన్నాడు శివరామ్.

"మా దగ్గిర అన్నీ ఒకటో నెంబరేసాబ్!" అంటూ గిరిధర్‌లాల్ సేల్స్‌గర్ల్‌కి సిగ్నల్ ఇచ్చాడు.

నీలంరంగు దుస్తులు ధరించిన బాబ్డ్ హెయిర్ సేల్స్‌గర్ల్ ఉంగరాల కేస్ పట్టుకొచ్చింది. గిరిధర్‌లాల్ ఉంగ

రాల్ని వర్ణిస్తూ, రేట్లు చెప్పడం ప్రారంభించాడు. శివరామ్ సేల్స్‌గర్ల్‌ని చిరునవ్వుతో చూస్తున్నాడు. సేట్ చదువుతూన్న దండకం అతన్ని ఈ లోకంలోకి లాక్కొచ్చింది. అతను అందించిన వంకీ ఉంగరాన్ని అందుకున్నాడు శివరామ్.

"తొమ్మిదివందలా దెబ్భై రూపాయలు, సాబ్!" అన్నాడు సేట్.

శివరామ్ ఉంగరాన్ని నిర్లక్ష్యంగా పడేశాడు. "ఇంకా ఖరీదైనవి లేవూ?" అన్నాడు, సేల్స్‌గర్ల్‌ని చూస్తూ—

గిరిధర్‌లాల్ తలపంకించాడు. ఆకీన్ షేప్‌లో వున్న ఉంగరాన్ని శివరామ్‌కి అందించాడు. ఆకీన్ షేప్ మధ్యలో డైమండ్ ఆకారంలో వజ్రం మెరుస్తోంది.

"ఎంత?" అడిగాడు శివరామ్, ఉంగరాన్ని పరిశీలిస్తూ.

"మీది సెలెక్షన్ ఠీక్‌గావుంది!" అన్నాడు గిరిధర్‌లాల్ ప్రోత్సాహకరంగా. "ఏమంటావ్, రీటా?" ప్రశ్నించాడు సేట్, సేల్స్‌గర్ల్‌ని.

"సర్టెన్లీ!" అంది రీటా నవ్వి, వయ్యారం రంగరిస్తూ.

"ఎంత?" శివరామ్ కంఠంలో అసహనం ధ్వనించింది.

"వెయిట్ తక్కువున్నా, డిజైన్ జబర్దస్తీగావుంది. ఒక వెయ్యి తొమ్మిదివందలా ఎనభైయేడు రూపాయల్ అవుతుంది సాబ్!" సేట్ తడుముకోకుండా సమాధానం చెప్పాడు.

"రేటు ఎక్కువనిపిస్తోంది," శివరామ్ అనుమానంగా అన్నాడు.

"ఇక్కడ రేట్ హెక్కువ చెప్పేదీ లేదూ, తక్కువ

చేసేదీలేదు సాబ్. ఫిక్స్డ్ ప్రైస్!" సేట్ మళ్ళీ నాలుగు బంగారం పళ్ళు చూపించాడు.

"ఓకే," అన్నాడు శివరామ్.

"సైజు చూసుకోండి" అంది రీటా.

"యస్. మరిచేపోయాను," శివరామ్ నవ్వాడు. "ఎక్స్‌క్యూజ్ మీ," అంటూ రీటా చేతినిపట్టుకుని ఆమె వేళ్ళను నొక్కుతూ పరిశీలనగా చూశాడు. అతని చూపులు సేట్ వేపు తిరిగాయి.

"మా ఆవిడసైజూ, రీటాసైజూ ఒక్కటే!" అన్నాడు. రీటా నవ్వింది.

"రీటా, ఉంగ్రం ట్రైచెయ్!" సేట్ ఆజ్ఞాపించాడు ఉషారుగా.

"కరెక్ట్‌సైజ్!" అంది రీటా ఉంగరం వేలికి తగిలించి, తీస్తూ.

"ప్యాక్ చెయ్యమంటారా సాబ్?" సేట్ అడిగాడు; ఎక్కువ రేటు చెప్పినందుకు బేరం జారిపోతుందేమో అన్న గాబరాతో.

"ఓయస్.... నేను క్యాష్ పట్రాలేదు. చెక్కిస్తాను. జేబుదొంగలు ఎక్కువైపోయారు. క్యాష్‌తో తిరగడం ప్రమాదం అని నా అభిప్రాయం. పైగా ఇవాళ శనివారం. బ్యాంక్ మూసేశారు...." అన్నాడు శివరామ్ జేబులోంచీ చెక్కుబుక్ తీస్తూ.

గిరిధర్‌లాల్ ఇబ్బందిగా, ఒక్కరవ అనుమానంగా చూశాడు. నాలుకతో పెదవుల్ని తడుపుకొన్నాడు.

"పదమూడు రూపాయలు తక్కువ రెండువేలు చెప్పారు. సరిగ్గా రెండువేలకి చెక్కురాస్తాను. నాకు రౌండ్‌ఫిగర్స్ అంటే ఇష్టం. సోమవారం పొద్దుటే

చెక్కు బ్యాంకులో వేసుకోండి," అన్నాడు శివరామ్ సేట్ కి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా.

సేట్ మొహంలో అనుమానం మాయమైంది. చిరునవ్వు ప్రత్యక్షమైంది.

"ఠీక్ హై.... అలాగే రాయండి. తమ పేరూ అడ్రసూ చెప్తే...." అన్నాడు సేట్.

"ష్యూర్. జె. శివరామ్, ఫీల్డు ఆఫీసర్, ఎక్స్ఇంపోర్టు కార్పొరేషన్, 284, చౌరంఘీ."

గోల్డు కాప్ వున్న పెన్నుతో శివరామ్ చెక్కు రాసి, సేట్ ముందు పడేశాడు. రీటా రింగ్ పాకెట్ ని శివరామ్ కి అందించింది, చిరునవ్వుతో.

"థాంక్స్!" అన్నాడు శివరామ్.

"యూ ఆర్ వెల్ కం!" అంది రీటా మెరిసే కళ్లతో.

శివరామ్ బైటికి నడిచాడు. అప్రయత్నంగా తను చెప్పిన ఎక్కువ రేట్ కి మరో పదమూడు కలుపుతూ, తృప్తికరంగా నవ్వుకొంటూ సేట్ గిరిధర్ లాల్ చెక్కుని జాగ్రత్త చేశాడు.

తన తెలివి మీద గిరిధర్ లాల్ కి ఎంతో నమ్మకం. కస్టమర్ వాలకం చూసి, అతని తత్వం ఇట్టే గ్రహించి, తడుముకోకుండా రేటు రెండింతలు చేసి చెప్పేయగలడు! కొంతమంది కస్టమర్స్ కి డాబుసరి ఎక్కువ. ఇచ్చేడబ్బుకీ, పుచ్చుకునే వస్తువుకీ పొంతనకుదురుతుందో, లేదో అని కూడా ఆలోచించరు! ఇందాకటి రింగ్ కస్టమర్ ఆజాతి వాడే! అంత చురుకైన బుర్ర వుండబట్టే సొంత రాష్ట్రం రాజస్థాన్ లో దివాలాతీసిన తను ఆంధ్రాలో అంతస్తు లెక్కుతున్నాడు! గిరిధర్ లాల్ గర్వంగా నవ్వుకున్నాడు.

"పకడ్బందీ అయిన కస్టమర్!" అన్నాడు రీటాతో,

నవ్వుతూ.

"నైస్, యంగ్ అండ్ స్పోర్టివ్!" అంది రీటా శివ రామ్ నొక్కిన వేళ్ళను తడుముకుంటూ.

2

చిందరవందరగా వున్న జుట్టు. బాగా నలిగిపోయిన పైజమా, జుబ్బా, ఎరుపెక్కిన కళ్లు, శివరామ్ నీరసంగా నడుస్తున్నాడు. అతని కాళ్ళకున్న చెప్పులు సేవ్ మెంట్ మీద డల్ గా శబ్దం చేస్తున్నాయి. పడివెళ్తున్న నగల దుకాణాల్ని చూస్తూ మెల్లగా కదులుతున్నాడతను.

'మహావీర్ జ్యువలరీ మార్ట్' ముందు ఆగాడు శివరామ్.

చిన్న షాపు. అట్టేజనంలేరు శివరామ్ లోపలికెళ్ళాడు.

షాపు యజమాని తారాచంద్ శివరామ్‌ని అదో రకంగా చూశాడు. 'ఏంకావాలి?' అని బొంగురుగా అడిగాడు.

శివరామ్ జుబ్బా జేబులోంచీ ఉంగరాన్ని తీసి కౌంటర్ మీద పెట్టాడు.

"ఈ ఉంగరాన్ని అమ్మేస్తున్నా. ఎంతొస్తుందో చెప్పండి," అన్నాడు శివరామ్, అటూ ఇటూ చూస్తూ.

తారాచంద్ ఉంగరాన్ని నిర్లక్ష్యంగా చేతిలోకి తీసుకున్నాడు. ఉంగరాన్ని రెండు క్షణాలూ, శివరామ్‌ని నాలుగుక్షణాలూ చూశాడు. శివరామ్ ఆత్రంగా చూస్తున్నాడు.

"నాణ్యమైన సరుక్కాదు. డిజైన్ జర పాతది. ఆయిదువొందల్ కూడా చెయ్యదు....అయినా ఇలాంటివి మేం కొన్నోల్ చెయ్యం...."

"సేట్ జీ,చాలా అర్జెంటు. మీ రెంతిస్తారో ఇవ్వండి."

శివరామ్ కంఠం దీనంగా, ఆర్తంగా ధ్వనించింది.

సేట్ అర్ధమైనట్టు తల పంకించాడు. ఉంగరంచుట్టూ పిడికిలి బిగించాడు. "కూచో క్షణంలో వస్తా," అంటూ తన వెనకున్న తలుపుని తోసుకుని లోపలికి వెళ్ళిపోయాడు. శివరామ్ స్టూలుమీద చతికిలబడ్డాడు.

నిమిషాలు గడుస్తున్నాయి. శివరామ్ అసహనంగా కదుల్తూ చీటికీ, మాటికీ షాపులోని గోడ గడియారాన్ని చూస్తున్నాడు.

పదిహేను నిమిషాలు గడిచాయి.

షాపుముందు రోడ్డుమీద పోలీస్ జీపు సడన్ బ్రేక్‌తో ఆగింది. ఒక ఇన్స్‌పెక్టరూ, ఇద్దరు కానిస్టేబుల్సూ కిందకి ఉరికారు. నాలుగు అంగల్లో షాపులోకి దూరారు. అదే క్షణంలో తారాచంద్ తలుపు తెరుచుకుని షాపులో ప్రత్యక్షమయ్యాడు.

"నమస్తే ఇన్స్‌పెక్టర్ జీ, దయ్‌చెయ్యండి! దయ్‌చెయ్యండి!" అంటూ ఆహ్వానించాడు.

ఇన్‌స్పెక్టర్ చేతిలోని బెత్తం తారాచంద్‌కి ప్రతి నమస్కారం చేసింది.

"మీరు ఫోన్లో రిపోర్టిచ్చింది ఎవరి గురించి?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

"ఇతనే!" తారాచంద్ విజయోత్సాహంతో అరుస్తూ, శివరామ్‌ని చూపించాడు.

పోలీసులిద్దరూ శివరామ్‌కి చెరోవైపు నిలబడ్డారు, అలర్ట్‌గా. ఇన్‌స్పెక్టర్ అతన్ని తదేకంగా చూస్తున్నాడు. వాంటెడ్ లిస్టులోని ఏదో ఫోటోతో పోలిక కలపడానికి ప్రయత్నిస్తున్నట్టున్నాయి అతని చూపులు. అతని చేతిలో లాఠీ తైతక్కలాడుతోంది. శివరామ్

ఇన్‌స్పెక్టర్ని, తారాచంద్‌నీ అయోమయంగా చూశాడు.

ఇన్‌స్పెక్టర్ తారాచంద్ వైపు యెడం చేతిని చాచాడు. తారాచంద్, శివరామ్ యిచ్చిన ఉంగరాన్ని ఇన్‌స్పెక్టర్‌కి అందించాడు.

"ఈ ఉంగరం పదహారు వందల్దాకా చేస్తుంది ఇన్‌స్పెక్టర్ సాబ్. ఇతను అయిదు వొందలకి అమ్మడానికి తయార్ అయ్యేసరికి మాకీ హానుమానం వేసింద సాబ్. ఇది దొంగసొత్తు అయ్‌వుంటుందని మేం పసిగట్టినామ్. అందుకే బయూర్‌గా తమ్కి ఫోన్ కొట్టినామ్...." తారాచంద్ ఉత్సాహంతో చెప్పుకుపోతున్నాడు. ఇన్‌స్పెక్టర్ లాఠీతో అతన్ని వారించి, శివరామ్‌ని తీక్షణంగా చూశాడు.

"నీ పేరు?"

శివరామ్ చెప్పాడు.

"అడ్రస్?"

శివరామ్ చెప్పాడు.

"ఎక్కడ కొట్టేవు దీన్ని?" ఇన్‌స్పెక్టర్ ఉంగరాన్ని చూపిస్తూ గద్దించాడు.

"గిరిధర్‌లాల్ జ్యూవలర్స్‌లో .... కొట్టేయలేదు; కొన్నాను," శివరామ్ జవాబిచ్చాడు.

"అలాగా! ఎంతకో?" ఇన్‌స్పెక్టర్ కంఠంలో వెటకారం ధ్వనించింది.

"రెండు వేలు...."

"అబ్బో! డబ్బిచ్చావా?" ఎలుకతో ఆడుకుంటున్న పిల్లి మోస్తరుగా ప్రవర్తిస్తున్నాడు ఇన్‌స్పెక్టర్.

"లేదు; చెక్కిచ్చాను" శివరామ్ నిర్లక్ష్యంగా అన్నాడు.

"ఎప్పుడు?"

"ఇవాళ మధ్యాహ్నం....ఇంతకీ యేమి టిదంతా?" శివరామ్ విసుగ్గా అడిగాడు.

"ప్రశ్నలు నేను అడుగుతాను; నువ్వు జవాబులు చెప్పు. వొళ్ళు దగ్గర పెట్టుకుని....ఆఁ....మధ్యాహ్నం రెండు వేలకి కొన్న ఉంగరాన్ని సాయంత్రానికల్లా అయి దొందలకి అమ్మజూశావ్. ఎందుకు? బంగారం వెల అంత భయంకరంగా పడిపోలేదే!" ఇన్స్పెక్టర్ యెగతాళిగా అన్నాడు. శివరామ్ అతన్ని చురచుర చూశాడు.

"నా యిష్టమొచ్చినంతకు కొంటాను; అమ్ముతాను. అది నేరం కాదుగా?"

"ఏది నేరమో, ఏదికాదో మేం చెప్తాం. దీన్ని తెగ నమ్మడానికి యెందుకు ప్రయత్నించావో మర్యాదగా చెప్తావా! చెప్పించమంటావా?" ఇన్స్పెక్టర్ కోపంగా అడిగాడు.

శివరామ్ క్షణకాలం ఆలోచించాడు. "ఆల్ రైట్! ఇవాళ మా వెడ్డింగ్ డే. నా భార్యకి ప్రెజెంట్ చేయా లనుకొన్నాను. ఆర్నెల్లుగా మా ఇద్దరి మధ్యా అంత బాగాలేదు. ఈ రింగు అంతా సర్దుబాటు చేస్తుందను కున్నా....కానీ....నా భార్య....నాతో సంబంధాన్ని శాశ్వతంగా తెంచేసుకొంటున్నా నంది. ఆమె మనసుని యెవరో పాడుచేశారు....యెంత బతిమాలినా ఆమె విన లేదు. నేను కట్టిన తాళిని....తీసి....విసిరికొట్టింది.... నాకు జీవితంమీద విరక్తి కలిగింది. ఆమెకు దూరంగా ఈ ప్రదేశానికి దూరంగా యెటో వెళ్ళిపోవాలనిపించింది. సమయానికి నా దగ్గర క్యాష్ లేదు. అందుకే ఉంగరాన్ని అమ్మేస్తున్నా. దాన్ని కొన్న ఉద్దేశం నెరవేరనప్పుడు,

నా జీవితం నాశనం అయ్యేటప్పుడు దాని విలువతో నాకు పనిలేదు....” శివరామ్ ఆగాడు.

ఇన్స్పెక్టర్ విసుగ్గా చూశాడు. ఇలాంటి కథలు తను యెన్నో విన్నాడు! ఒక కానిస్టేబుల్ని షాపు మూలకి తీసుకెళ్లాడు. శివరామ్ యిచ్చిన అడ్రసుకి వెళ్ళి, అక్కడ అతని భార్య అంటూ వుంటే ఆమె కథనం ఏమిటో కనుక్కు రమ్మన్నాడు. శివరామ్ చెప్పింది నిజమో కాదో కనుక్కొని; గిరిధర్లాల్ షాపులో తన్ను కల్సుకోమన్నాడు. కానిస్టేబుల్ గబగబా వెళ్ళిపోయాడు.

ఇన్స్పెక్టర్ శివరామ్ వైపు నడిచాడు. “కమాన్!” అన్నాడు.

“ఎక్కడికి? ఎందుకు? నాకు అర్జెంటు పనుంది....” శివరామ్ అరిచాడు.

“నీ పని నేను చూస్తాను....గిరిధర్లాల్ షాపుకి వెళ్దాం, అతడు యేమంటాడో విందాం....టూ నాట్టూ ఇతన్ని జీపులో యెక్కించు!” అంటూ సేట్ తారాచంద్ వేపు తిరిగాడు. “మీరూ రండి” అన్నాడు.

శివరామ్ మెల్లిగా కదిలాడు. తారాచంద్ ఇన్స్పెక్టర్ ముందుకి నడిచాడు. “జరూర్ అయేగా ఇన్స్పెక్టర్ సాబ్! ఏడాదిలో మేం సంపాదించేదాన్ని ఒక్క క్షణంలో మాయంచేసే ఇలాంటి బడాచోర్లని పట్టుకోడానిక్కి ఏం చెయ్యమన్నా చేస్తామ్! పదండి, పదండి!” తారాచంద్ ఉత్సాహంగా అన్నాడు.

శివరామ్ అతనివేపు కోపంగా చూస్తూ తిరిగాడు. కానిస్టేబుల్ చెయ్యి అతని భుజంమీద బలంగా పడింది. అతను కదిలాడు. కాస్సేపట్లో జీపు స్టార్టయింది.

3

ఇన్‌స్పెక్టర్ని, కానిస్టేబుల్ని చూసి, సేట్ గిరిధర్ లాల్ ఆదరాబాదరా లేవబోయాడు. అతని భారీ శరీరం సహకరించలేదు. తలగడలమీద చతికిలబడి, నాలుగు బంగారుపళ్ళు చూపిస్తూ ఇన్‌స్పెక్టర్ని, వోటర్ని ఆహ్వానించే ఎన్నికల అభ్యర్థిలా ఆహ్వానించాడు. తారాచంద్‌కి 'రామ్ రామ్' చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ ఉంగరాన్ని గిరిధర్‌లాల్ ముందు పడేశాడు. శివరామ్‌ని అతని ముందుకు తోశాడు. గిరిధర్ లాల్ ఉంగరాన్నీ, శివరామ్‌నీ అయోమయంగా చూశాడు.

"ఈ ఉంగరాన్ని ఇతను మీదగ్గర కొన్నాడా?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

గిరిధర్‌లాల్ గుటకలు మింగాడు. మరీ సాదా అయిన వేషంలో వున్న శివరామ్‌ని అతను చటుక్కున పోల్చుకో లేకపోయాడు. దీనంగా రీటా వేపు చూశాడు.

"అతనే సేట్‌జీ! కాకపోతే, ఇప్పుడు రాళ్ళు తీసేసిన ఉంగరంలా వున్నాడు!" అంది రీటా. సేట్ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

"ఠీక్ హై. ఉంగ్రం ఇతనేకి అమ్మామ్ ఇన్‌స్పెక్టర్ సాబ్!"

"ఎంతకి?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

గిరిధర్‌లాల్ గతుక్కుమన్నాడు. చాలా యెక్కువ రేటు తీసుకొన్నట్టు తెల్సుకొని యితను పోలీసులకు ఫిర్యాదు చేశాడా? అంతా కలిసి, తారాచంద్ చేత ఉంగరాన్ని మదింపు వేయించారా? నిజం చెప్పక తప్పదు....

"... రెండు వేలకే అమ్మేశామ్ సాబ్! ఆ డిజైన్, ఆ

వజ్రమ్ రేట్ థోడా హైకా అని ముందే చెప్పి నామ్....”

“దబ్బిచ్చాడా?” ఇన్‌స్పెక్టర్ విసుగ్గా, అడ్డొస్తూ అడిగాడు.

“అహహ .... క్యాష్ తేలేదన్నాడు; చెక్కి చ్చాడు....”

“ఊ....ఏదీ ఆ చెక్కు? బ్యాంకులో చెల్లేదో, కుంపటి వెలిగించేదో చూద్దాం!”

గిరిధర్‌లాల్ క్షణంలో గాలి తీసేసిన బెలూన్‌లా అయిపోయాడు. చెరువులోంచీ గట్టుమీదకి విసరబడిన చేప మొప్పల్ని తెరిచినట్టు నోరు తెరిచాడు.

శివరామ్ అతన్నే చూస్తోన్నాడు. అతని నాలుగు బంగారు పళ్ళూ కిందికి రాలిపోతాయేమో అని పించింది.

గల్లాలోంచి అతి కష్టంమీద చెక్కుని ఇవతలికి తీసి వణికే చేత్తో ఇన్‌స్పెక్టర్‌కి అందించాడు. ఇన్‌స్పెక్టర్ చెక్కుని పరిశీలిస్తూ వుండిపోయాడు. గిరిధర్‌లాల్, శివ రామ్‌నీ, తారాచంద్‌నీ, ఇన్‌స్పెక్టర్నీ గాబరాగా చూస్తూ వుండిపోయాడు. ఇన్‌స్పెక్టర్ మాటలు అతని లోంచే ఒక గాబరాని తీసేసి, మరో గాబరాని ఎక్కిం చాయి.

“మధ్యాహ్నం రెండు వేలకి కొన్న ఈ ఉంగరాన్ని సాయంత్రం అయిదొందలకి అమ్మే ప్రయత్నం చేశా డితను. దాంతో, ఇది దొంగసొత్తు అని అనుమానించి తారాచంద్ మాకు తెలియజేశాడు. చూస్తోంటే ఇది దొంగచెక్కు అనిపిస్తోంది....”

“ఇన్స్పెక్టర్‌జీ, ఉంగరం మాకి ఇచ్చేయండి! ఈ

జోకర్ సాలాను జైల్లో పెట్టండి....” గిరిధర్‌లాల్ ఆత్రంగా అరిచాడు.

ఇన్స్పెక్టర్ చిన్నగా నవ్వాడు. “గాబరాపడకండి. మీ ఉంగరం ఎక్కడికీ పోదు! చెక్కు చెల్లుతుందో లేదో బ్యాంకుకి వెళ్తేగానీ తెలీదు. ఇవాళ శనివారం. సోమవారం దాకా ఆగాలి....”

చెవిలో జోరీగ దూరిన ఎద్దులా, గిరిధర్‌లాల్ తలని అటూ ఇటూ ఆడించాడు. “ఇన్స్పెక్టర్ సాబ్. ఈ జులాయిని వదలకండి. ఇదేదో తేలి మా పెకం మాకీ ముట్టే దాకా మీ కస్టడీలో వుంచుకోండి....” గిరిధర్‌లాల్ రొప్పుతున్నాడు.

ఇన్స్పెక్టర్ సాలోచనగా శివరామ్‌వేపు చూస్తూ, బెత్తాన్ని గిరగిర తిప్పుతున్నాడు, వేళ్ళమధ్య. తలుపు తోసుకుని మొదటి కానిస్టేబుల్ ఆదరాబాదరా వచ్చాడు. ఇన్స్పెక్టర్ అతనికి దగ్గరగా, శివరామ్‌కి దూరంగా జరిగాడు. కానిస్టేబుల్ తగ్గుస్వరంలో ప్రారంభించాడు.

“తమ గొడవగురించి అతను చెప్పిందంతా నిజమే సార్. అతనితో సంబంధాన్ని తెంచేసుకుంటున్నట్టూ, త్వరలో చట్టరీత్యా విడాకులు తీసుకోబోతున్నట్టూ అతని భార్య— పేరు లత — చెప్పిందిసార్. ఉంగరం గురించీ, చెక్కుగురించీ చెప్పాను. బ్యాంకు ఖాతాలో డబ్బు లేక పోయినా, చెక్కు-బుక్కు మాత్రం ఎప్పుడూ అతనిదగ్గరుంటుందనీ. ఎంత పాడుపని చెయ్యడానికైనా అతను వెనుదీయడనీ అంది సార్, ఆమె. అందుకే అతని పీడ వదిలించుకోబోతున్నట్టు. దొంగచెక్కుతో ఉంగరంకొని తనకి వెడ్డింగ్ డే ప్రెజెంట్‌గా ఇవ్వబోయిన అతని లుచ్ఛా ప్రయత్నాన్ని విడాకులకేసులో ఒక పాయింటుగా ఉప

యోగించుకుంటానంది సార్!" అతను ఊపిరి పీల్చు కుంటూ ఆగాడు.

ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తల పంకించాడు. అతని కళ్ళు మెరుస్తున్నాయి. గంభీరంగా శివరామ్ వేపు అడుగు లేశాడు. అతని మొహంలోకి తీక్షణంగా చూశాడు. "ఈ క్షణంనుంచీ నువ్వు మా అతిథివి!" అన్నాడు వెట కారంగా.

"ఇన్‌స్పెక్టర్ జీ. మంచిమాట చెప్పినార్. ఉంగ్రం మాకీ యిచ్చేస్తారా?" సేట్ గిరిధర్ లాల్ ఆత్రంగా అడిగాడు.

"ఇదేదో తేలేదాకా ఇతనూ, ఉంగరం మా కస్టడీలో వుంటారు. సోమవారం చెక్కుని బ్యాంక్‌లో వేసేదాకా అది చెల్లుతుందో, లేదో తెలీదు...."

గిరిధర్ లాల్ తలను గంగిరెద్దులా ఆడించాడు. "ఠీక్ గా చెప్పినార్! మేమ్ ఫిర్యాద్ రాసిస్తాం. ఈ గూండాని జెయిల్లో పడేయండి!"

"ఓకే....ఓకే....మీరు కంప్లెయింట్ యివ్వండి. తారాచంద్ జరిగిందంతా స్టేట్‌మెంట్ రాసిస్తాడు. వాటి బేస్ మీద వీణ్ణి లోపల తోస్తాం. సోమవారం బ్యాంక్‌కి వెళ్ళి, నన్ను కల్సుకోండి," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

శివరామ్ తనని పట్టుకున్న కానిస్టేబుల్ చేతిని విది లించుకొని ఇన్‌స్పెక్టర్ దగ్గరగా నడిచాడు. అతని కళ్ళ లోకి తీక్షణంగా చూశాడు. "ఇన్‌స్పెక్టర్, తొందరపడు తున్నారు. ఆ చెక్కు చెల్లుతుంది. నన్ను అరెస్టు చేస్తే ఆ తరవాత విచారిస్తారు!"

ఇన్‌స్పెక్టర్ పళ్ళు కొరికాడు. "పటవ్! నీ కిది

మొదటి కేసు కావొచ్చు. నీలాంటి జాలాయిల్ని నా తలలో వున్న వెంట్రుకలంత సంఖ్యలో చూశాను! ... టూ నాట్టూ, బేడీలు తగిలించు!"

"ఇది అన్యాయం!" శివరామ్ అరిచాడు. అతని ఎడం చేతికి బేడీ క్లిక్‌మంది. శివరామ్ తనచేతికి వున్న బేడీని, ఇన్‌స్పెక్టర్ని క్షణకాలం చూశాడు. అతని చూపులు సేట్ గిరిధర్‌లాల్ మీదా, తారాచంద్ మీదా నిలిచాయి. ఇద్దరూ యేదో రాస్తున్నారు. రీటా అతన్నే ఆశ్చర్యంగా చూస్తోంది.

సేట్‌జీలు యిద్దరూ కంప్లెయింట్‌నీ, స్టేట్‌మెంట్‌నీ ఇన్‌స్పెక్టర్‌కీ అందించారు.

గిరిధర్‌లాల్ సైగతో రీటా ఫ్రిజ్‌లోంచి చల్లటి బాదంపాలుని ఇన్స్‌పెక్టర్‌కీ, పోలీసులకీ అందించింది.

కాసేపట్లో శివరామ్‌ని యెక్కించుకొని పోలీస్‌జీపు వెళ్ళిపోయింది.

గిరిధర్‌లాల్ నీరసంగా పరుపుమీద చతికిలబడ్డాడు. అతని యెదురుగా పద్మాసనం వేసుక్కూచుని తారాచంద్ తను బుర్రను వుపయోగించిన విధానాన్ని పురాణ కాలక్షేపంలా చెప్పడం ప్రారంభించాడు.

4

సోమవారం, ఉదయం పదకొండు కావస్తోంది.

ఫియట్ కారు పోలీస్‌స్టేషన్ ముందు ఆగింది.

సేట్ గిరిధర్‌లాల్ భారీశరీరం కార్లోంచీ యివతలకి వచ్చింది. గున్న ఏనుగులా నడుస్తూ అతను స్టేషన్ లోపలికి ప్రవేశించాడు.

అతని మొహం నిండా చెమటలు కమ్మాయి. ఉల్లి

పొరలాంటి తెల్లటి జుబ్బా చెమటతో అతని శరీరానికి అక్కడక్కడా అతుక్కుపోయింది. గోల్డ్‌రిమ్ అద్దాలు తీసి, జేబురుమాలుతో అతను ముఖం తుడుచుకొని, ఇన్‌స్పెక్టర్‌కి నమస్తే చెప్పాడు. బల్లముందున్న కుర్చీలో తన శరీరాన్ని అతి కష్టంమీద ఇరికించాడు. నాలుకతో పెదాలు తడుపుకున్నాడు.

"చెక్కు తిరగ్గొట్టబడిందా?" ఇన్‌స్పెక్టర్ అసహనంగా అడిగాడు.

"ఠీక్ గా క్యాష్ హయ్యింది ఇన్‌స్పెక్టర్ సాబ్." గిరిధర్ లాల్ అదోరకంగా చూస్తూ జవాబిచ్చాడు. ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా నోరు తెరిచాడు.

"వాట్!"

"హా. సాబ్! సొమ్ము తీసుకుని తిన్నగా యిక్కడికి వచ్చినామ్!"

ఇన్‌స్పెక్టర్ నిరుత్సాహంగా నిట్టూర్చాడు. "సేట్ తారాచంద్ దొంగని చూసి దొంగ అనుకున్నాడు. ఆల్ రైట్ ....మనమేం చేస్తాం?...." అంటూ బెల్ నొక్కాడు. టూనాట్టూ వచ్చి, గెడకర్రలా నిలబడ్డాడు.

"శివరామ్‌ని వొదిలేయండి. చెక్కు క్యాషయ్యింది" అన్నాడు మెల్లిగా. గిరిధర్ లాల్ వేపు చూశాడు.

"సేట్ జీ చెక్కు క్యాషయ్యిందనీ, ఉంగరంతో బాటు శివరామ్‌ని వదిలేయమనీ రాసియ్యండి," అన్నాడు.

"జరూర్ గా రాసిస్తామ్!" అంటూ సేట్ కుర్చీలో ఇరుగ్గా సర్దుకొన్నాడు.

టూనాట్టూ శివరామ్‌ని వెంటబెట్టుకొచ్చాడు. శివ

రామ్ కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. జుట్టు చిందరవందరగా వుంది. గడ్డం బాగా మాసింది. పైజామా, జుబ్బా బాగా నలిగి ముట్టికొట్టుకు పోయాయి.

"మిస్టర్ శివరామ్, పొరపాటు జరిగింది. చెక్కు క్యాషయ్యింది. అనుమానంమీద అరెస్టు చేశాం. ఉంగరం మీదే. తీసుకెళ్ళొచ్చు," అన్నాడు ఇన్‌స్పెక్టర్ తల వంచుకొని, టేబుల్ మీదున్న పేపర్ వెయిట్ పరికిస్తూ.

శివరామ్ మౌనంగా అతన్ని చూశాడు. అతని చూపులు గిరిధర్‌లాల్ మీద వాలాయి. నాలుక కొసని పెదిమల మధ్యకు చాపి, గోల్డు పెన్‌తో కష్టపడుతూ ఏదో రాస్తున్నాడు గిరిధర్‌లాల్. శివరామ్ ఇన్‌స్పెక్టర్ వేపు వెటకారంగా చూశాడు.

"థాంక్స్ ఎ లాట్, ఇన్‌స్పెక్టర్!" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ తటాలున తలెత్తి చూశాడు. శివరామ్ నవ్వు అతనికి కమ్చీ దెబ్బలా తాకుతోంది.

"ఉంగరం ముట్టినట్టు రసీట్ రాసివ్వండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ మెల్లిగా.

"చెక్కు క్యాషయ్యిందనీ, ఉంగరం పైకం ముట్టిందనీ, అది దొంగసొత్తు కాదనీ సేట్‌ని రాసివ్వమనండి. దాన్ని మీరు ఎండార్స్ చేయ్యండి. ఆ తర్వాత ఆ ఉంగరంతో ధైర్యంగా తిరగ్గలను," అన్నాడు శివరామ్.

"జరూర్, జరూర్ .... రాసిస్తాం, రాసిస్తాం" అన్నాడు సేట్ గిరిధర్‌లాల్ ఆత్రంగా.

పదినిమిషాల తరవాత శివరామ్ ఉంగరంతో స్టేషన్ బైటికి నడిచాడు.

5

బుధవారం మధ్యాహ్నం మూడు కావస్తోంది.

సేట్ గిరిధర్ లాల్ బూరుగుమూది దిళ్ళమీద వెనక్కి వాలి తృప్తికరంగా నిట్టూర్చాడు. ఈ వారం బేరం బాగా సాగుతోంది. ఈ ఏడు పూర్తిగా ఇలాగే సాగితే, చారస్తాలో మరో బ్రాంచి తెరవొచ్చు. త్వరలో చారస్తాలో తెరవబోయే బ్రాంచికి ఎంతపడుతుందో గిరిధర్ లాల్ లోపల్లోపలే ఎస్టిమేట్స్ వేయసాగేడు.

షాపు గుమాస్తా ఒక రిజిష్టర్డు కవర్ని అతనికి అందించి వెళ్ళిపోయాడు.

గిరిధర్ లాల్ ఆలోచిస్తూ కవర్ని చింపి, కాగితాల్ని ఇవతలకి లాగి, అప్రయత్నంగా చదువుతూ వుండిపోయాడు. కాగితాల్ని పట్టుకున్న అతని చేతులు మెల్లగా వణకడం ప్రారంభించాయి. అక్షరాలు అలుక్కుపోతున్నాయి. అతి ప్రయత్నంమీద సర్దుకొని, కాగితాల్ని బల్లమీద పరిచి, జాగ్రత్తగా మరోసారి చదవడం ప్రారంభించాడు.

రాజారామ్ అండ్ రాజారావ్, అడ్వొకేట్స్, పంపించిన నోటీసది. దాన్ని చదూతూంటే గిరిధర్ లాల్‌కి ఊపిరి పీల్చుకోడం కష్టమైపోతోంది. పీలుస్తున్న ఆక్సిజన్ చాలటం లేదనిపిస్తోందతనికి.

తమ క్లయింటు, జె. శివరామ్‌మీద తప్పుడు కేసు బనాయించి గత శనివారం సాయంత్రం నుండీ సోమవారం ఉదయం పదకొండు గంటలదాకా అక్రమంగా జైల్లో నిర్బంధించబడేలా చేసినందుకు తమ క్లయింటు సేట్ గిరిధర్ లాల్ మీద లక్షరూపాయలకు పరువునష్టం దావా వేస్తున్నట్టు ఆ నోటీసుద్వారా అడ్వొకేట్స్

తెలియజేశారు.

గిరిధర్‌లాల్ శరీరం తలంతప్పి, గడగడ వణక సాగింది. వొళ్ళంతా చెమటలు కమ్మేశాయి. నాలుక తడి ఆరిపోయి రబ్బరుముక్కలా తయారవుతోంది. గ్లాసులో వున్న నీళ్ళను గడగడా తాగేశాడు. రెండు మూడుసార్లు ముక్కుతో, నోటితో ఒకేసారి గాలి పీల్చు కున్నాడు. తారాచంద్ తెలివి, ఇన్‌స్పెక్టర్ ఆవేశం తన కొంపకి నిప్పెట్టేశాయి. ఇద్దరూ కలిసి తనలో లేని పోని అనుమానాలు కల్పించి, చాకులాంటి కస్టమర్ మీద కంప్లెయింట్ ఇప్పించారు. లోతుచూసి, మెడకి రోలు కట్టి నట్టేట్లో ముంచారు.

గిరిధర్‌లాల్ కోపంతో నాలుగు బంగారం పళ్ళని జాగ్రత్తగా కొరుక్కున్నాడు. టెలిఫోన్‌ని దగ్గరకు లాగి ఇన్‌స్పెక్టర్ నెంబర్ తిప్పాడు. అటువేపునుంచీ ఇన్‌స్పెక్టర్ కంఠం ఖంగుమంది.

"ఇన్‌స్పెక్టర్ సాబ్, గిరిధర్‌లాల్ని మాట్లాడుతున్నా. మా కొంపా మున్గి పోతోంది. ఆ శివరామ్ లక్షరూపా యల్ డేమేజస్ కేసూ ప్లీడర్ నోటీస్ ఇచ్చాడు. మీకీ తొంద్రపాటువల్లా మాకీ లుక్సానా...."

"ఐసీ!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఐసా కాదు సాబ్. ఇప్పుడు మాకీ ఏం చెయ్యమం టార్?"

"అది మీ యిష్టం" ఇన్‌స్పెక్టర్ ముక్తసరిగా అన్నాడు.

"అఁ! పిల్లాని పేరంటాన్కీ వచ్చి....అడక త్తెరలో ఇర్క్కించి...."

"సేట్ జీ, మేం మీ క్షేమంకోరే వచ్చాం. అప్పుడే మీరు కంప్లెయింట్ ఇవ్వకుండా మానుకోవాల్సింది!" ఇన్‌స్పెక్టర్ కంఠంలో వెటకారం ధ్వనించింది.

"ఏ బహుత్ అన్యాయ్ హై! లేనిపోని మానుమానాలు పుట్టించి...." క్లిక్‌మన్న శబ్దం వినిపించి గిరిధర్‌లాల్ కోపంగా మాతృభాషలో బూతులు తిట్టుకొంటూ ఫోన్ని దభాల్న పడేశాడు.

ఏదో గుర్తొచ్చి, తారాచంద్ నెంబరు తిప్పాడు. తారాచంద్ పలకగానే ఆదరాబాదరా అంతా ఏకరువు పెట్టాడు. అతని అతితెలివిని తిట్టిపోశాడు. అక్షరూపాయలూ అతనే యిచ్చుకోవాలన్నాడు. ఇన్‌స్పెక్టర్‌కీ, అతనికీ ఒక్కటిగా మాటల్లోనే గోరీ కట్టేశాడు. తారాచంద్ శాంతంగా అంతా విన్నాడు. గిరిధర్‌లాల్ చెప్పుతూ కొంచెం ఆగేక ఇలా అన్నాడు:

"గిరిధర్ భాయ్, కొంపల్ అంటుకుంటే నిప్పెట్టిందెవరా అని ఆలోచిస్తూ కూచోడం తెల్వితక్కువ పని. ముందుగా మంటల్ని ఆర్పాలి. మీ జాగాలో మేముంటే ఏం చేస్తామో తెల్సా?"

"ఏం చేస్తావ్?" గిరిధర్‌లాల్ గద్దించాడు.

"జరూర్‌గా, నోటీసిచ్చిన వకీల్ ద్వారా పార్టీని కల్సుకుంటాం. మెల్లిగా, సజావ్‌గా పార్టీని దువ్వి, డామేజస్‌లో కొన్ని సున్నాల్ని తగ్గించేస్తాం! జరిగిందీ చూస్తే జరగబోయేదీ ఆగేలా లేదనిపిస్తోంది...."

"క్యా?" గిరిధర్‌లాల్ ఆశ్చర్యంతో అరిచాడు.

"హాఁ! అరే భాయీసాబ్! మాకీ తిరదే ఫాయిదా హై. అది దొంగ చెక్కే అయ్యివుంటే మీకూ మాకీ మెచ్చు

మ నేవార్! అంచేత జరూర్‌గా నిప్పుని ఆర్పండి.... ఆగ్ బుజావ్! రాజీ ప్రయత్నం చేయండి!" అంటూ తారా చంద్ ఫోన్ పెట్టేశాడు.

గిరిధర్‌లాల్ చేతిలోంచీ రిసీవర్ అప్రయత్నంగా క్రిందికి జారింది. తనకి తెలీకుండానే అతను పాములా బుసకొడుతున్నాడు. రెండు గ్లాసుల నీళ్ళు తాగాడు.

నిదానంగా ఆలోచిస్తే తారాచంద్ మాటలు అర్థవంతంగా అవుపిస్తున్నాయి. తను ముళ్ళకంపమీద ముఖ్‌మల్ గుడ్డని ఆరేశాడు. జాగ్రత్తగా, వొడుపుగా లాక్కోవాలి. ఇప్పుడు తను తన వ్యాపార నైపుణ్యాన్ని ఉపయోగించాలి.

గిరిధర్‌లాల్ టెలిఫోన్ డైరెక్టరీ తిరగేసి, రాజారామ్ అండ్ రాజారావ్, అడ్వొకేట్స్ నెంబరు చూశాడు. ఇప్పుడు కొంచెం తక్కువగా వణుకుతున్న వేళ్ళతో నెంబరు తిప్పాడు.

"అడ్వొకేట్ రాజారామ్ హియర్!" అందో కంఠం.

"నమస్తే వకీల్‌సాబ్! సేట్ గిరిధర్‌లాల్‌ని మాట్లాడుతున్నా. శివరామ్‌గారి తరఫున మీరు పంపిన నోటీస్ ఇప్పుడే అందింది. ఆ విషయంగా మీతో కొంచెం డిస్కస్ ...."

"ఐసీ.... మీ అడ్వొకేట్‌ని తీసుకుని కోర్టుకిరండి...." అంది రాజారామ్ కంఠం నిర్లక్ష్యంగా.

"నోనోనోనో .... మీతో పర్సనల్‌గా మాట్లాడాలి.... కోర్టూ గీర్టూ ఎందుక్కలెండి...." గిరిధర్‌లాల్ ఆగాడు.

"ఐసీ....లక్కీ లీ, మా క్లయింటు ఇక్కడే వున్నారు. ఆయన్ని అడుగుతా.. ఒక క్షణం...."

రెండు నిమిషాలపాటు గిరిధర్ లాల్ నిశ్శబ్దాన్ని వింటూ దిళ్ళమీద కూచున్నాడు. అతనిలో ఏవో ఆలోచనలు తిరుగుతున్నాయి. చౌరస్తాలో ప్రారంభించాలనుకున్న బ్రాంచి పొగలో కలిసిపోయినట్టే! రాజారామ్ కంఠం తీగమ్మట పాకుతూ అతని చెవిని తాకింది.

"మిస్టర్ గిరిధర్ లాల్, మా క్లయింటు బాగా అఫెండయ్యారు. ఆయనకి మీరు అన్యాయం చేశారు. మీతో కోర్టులో తప్ప మరెక్కడా మాట్లాడ్డానికి సుముఖంగా లేరు...."

"నోనోనోనో....ఆప్ ఐసా నై బోల్నా....తమరలా అనకూడదు. పొరపాటు జరిగిపోయింది. సర్దుకుందాం.... మీరు...."

"పూర్తిగా వినండి. ఎలాగో మా క్లయింటుని ఒప్పించాను. ఆయన మిమ్మల్ని చూస్తారు. ఏ విధమైన గ్యారెంటీ మేం ఇవ్వలేం. కావాలంటే మీరు అరగంటలో ఇక్కడికి రావచ్చు" అంటూ రాజారామ్ ఫోన్ పెట్టేశాడు.

గిరిధర్ లాల్ కొంచెం తేలిగ్గా నిట్టూర్చాడు. షాపు చూసుకొమ్మని కొడుక్కి చెప్పి, ఆదరాబాదరా వెళ్ళి తన కారు ఎక్కాడు.

6

శివరామ్ నలగని సూటులో స్మార్ట్‌గా నడుస్తూ స్టేషన్‌లో ప్రవేశించాడు. అతని చేతిలో సరికొత్త సూట్ కేస్ వుంది. ప్లాట్ ఫామ్ ముందు రెడీగా వున్న ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ వైపు నడిచాడతను, జనాన్ని తోసు

కుంటూ. ఠీవిగా ఏ. సి. కంపార్టుమెంట్‌లోకి దూరాడు.

లత - అతని ప్రియురాలు—అతన్ని చిరునవ్వుతో చూసింది.

"శాయా, పండా?" అందామె.

"మన చెయ్యి తాకితే కాయలన్నీ పళ్ళవుతాయ్!" శివరామ్ సగర్వంగా అన్నాడు.

సీటుమీద చతికిలబడి, క్లిక్‌మనిపిస్తూ బ్రీఫ్‌కేస్‌ని తెరిచాడు. లోపలున్న ఎర్రటి కేస్ తెరిచి తళతళ లాడు తున్న రత్నాల నెక్లెస్‌ని తీశాడు. లతవైపు చిరునవ్వుతో చూశాడు. ఆమె వయ్యారంగా ముందుకి వంగింది.

నెక్లెస్‌ని ఆమె మెళ్ళో వేశాడు శివరామ్. లత ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ అతన్ని వాటేసుకో బోయింది.

"ఇంకా వుంది; వోపికపట్టు!" అంటూ శివరామ్, బ్రీఫ్‌కేస్‌లో పరచిన పల్చటి తువాల్ని లాగాడు. లత కళ్ళల్లో దీపాలు వెలిగాయి. బ్రీఫ్‌కేస్ నిండుగా వంద రూపాయల నోట్లకట్టలు నీట్‌గా పేర్చబడి వున్నాయి.

"ఓహ్! డార్లింగ్! ఎంత?" లత ఉద్రేకంతో అరిచింది.

"గిరిధర్‌లాల్ కాళ్ళ బేరానికొచ్చాడు. అయిష్టాన్ని నటిస్తూ, అరగంట ఏడిపించి, యాభై వేలకి వొప్పుకున్నా. ఈ నెక్లెస్ కొసరు వడ్డించాను! ఏడ్చాడు; మొత్తు కున్నాడు. ఆఖరికి లొంగిపోయాడు!"

"థాంక్యూ, డార్లింగ్!" అంది లత, నెక్లెస్‌ని తడుముకుంటూ.

"డోంట్ థాంక్ మీ మానీ! పోలీసుల ముందు నువ్వాడిన నాటకం నా ప్లానుకి ప్రాణం పోసింది!" అన్నాడు శివరామ్ నవ్వుతూ.

లత అతనితో శ్రుతి కలుపుతూ అతని వొళ్ళో వాలిపోయింది.

ఎక్స్‌ప్రెస్ కూత పెట్టి కదిలింది ఢిల్లీ వేపు.

—:అ యి పో యి ం ది:—

అంకితం

అపరాధ పరిశోధక సాహిత్యాన్ని ఆంధ్ర పాఠకులకు పరిచయం చేసిన సాహితీ శిల్పి కీ|| శే|| టెంపోరావ్ గారి — దివ్యస్మృతికి —